


**అప్పటికి యాభయొకటవ మనిషిని చూసి విసిగిపోయి, వేసారిపోయి వేదాంత ధోరణిలో పడిపోయేడు గవర్నమెంటు డాక్టరు దయానందరావు.**

యాభయొకటవ రోగి తనకున్న రోగాల లిస్టు ఏకరుపుపెడున్నాడు.

"కడుపులో మంటండీ-తల తిరిగిపోతదండి. కండ్ల మీదికి నిద్ర రావడంలేదు-రక్తం పోటు- ఒంటినిండా దురద- నాలిక పిక్కపోయే దాహం- ఉత్తిగనే పిడికిల్లు బిగుసుకపోతాయి....కా....ళ్ళు."

డాక్టరు రావు కాగితపు ముక్కమీద తలవంచి యమ సీరియస్‌గా గీకుతూ ఎందుకో యాభయొకటవ వ్యక్తిని ఎగాదిగా చూశాడు .... యాభయొకటవ వ్యక్తి కాగితపు ముక్కను చూస్తున్నాడు. అది మశూచి నివారణ అడ్వర్‌టైజ్‌మెంటు వాల్‌పోస్టరు ముక్క. ఆ ముక్కలో మశూచి పొక్కులున్నాయి. మళ్ళీ ఏదో జ్ఞప్తికొచ్చి యా. ఒ. వ్య.

"మరండీ కాళ్ళు పీకుతుంటాయి.... కడుపులో...."

డాక్టరు చీటీ గీకి యిచ్చేశాడు.

"సూది రాశారాండీ...."

"రాశాను పోవయ్యా...."

రోగి వెళ్ళిపోయాడు. డాక్టరు రావు బయటికి చూశాడు. క్యూ మెయినుగేటు దాటింది.... "వీళ్ళందరిని చూడకుండా పంపియ్యాలంటే కూడా రెండు రోజులు కావాలి...." చూస్తైతే మరో యాభయి మంది డాక్టర్లు కావాలి.

అంతలోనే ఫోను....

"స్థానిక ఎమ్మెల్లేగారి బామ్మర్దిగారి కొడుకు కొడుక్కు అజీర్ణమట... దానికి పనిలేని ఎమ్మెల్లేగారి రికమండేషన్ ...." అనుకుంటూ వచ్చి చేర్‌లో కూలబడిపోయాడు..

ఇందాక గీకిన చీటి యాభయి రెండవ వ్యక్తి చేతికిచ్చాడు డాక్టరు.... లేవబోయాడు....

"రోగం నాక్కాద్దొర-మా అయ్యకు."

"మీ అయ్యేడి?"

"ఆవల్నే కింద పడిపోయిండు దొరా."

"సీరియస్సా?"

ఆ మాట అర్థంకాక యాభయి రెండవ వ్యక్తి సీరియస్సయిపోయాడు.

"ఏం రోగం?"

## బూడిద



**అల్లం రాజయ్య**

"జెరం."

"ఇగో ఈ బిళ్ళేసుకొని పడుకోమను. పాలు బాగా తాగమను"

"పాలేడియి బాంచెన్-అంబట్ల కుప్పులేనోళ్ళం. ఆరు దినాలనుంచి ఆని శలీరం పెనం తీర్గ కాలిపోతంది. అచ్చెపోయే పాణంమీనున్నడు దొరా."

"తగ్గిపోతుందిలే."

"జెరం దొరా."

"అవునయ్యా జెరమే, జెరం మనిషికి రాకుంటే మాకు కొంసదా? తగ్గకుంటే ఏంజేస్తుంది. అదే తగ్గిపోతదిలే." రెండ రోజుల క్యూను చూడకుండా అర్జంటుగా ఎమ్మెల్యేగారింటికి అక్కడి నుంచి, వారి బామ్మర్దిగారింటికి అక్కడి నుంచి.... వారి కొడుకుగారింటికి.... వెళ్ళిపోయేడు డాక్టర్ దయానందరావు.

* * *

రెండవ నాడు.

యాభైరెండవ వ్యక్తి....

"మా అయ్యకు జెరం జారలేదొగా,"

"జారదామరి .... మనిషా? మాకా?"

డాక్టరుదొర మళ్ళీ రెండు బిళ్ళలిచ్చాడు.

* * *

మూడవనాడు....

"గుడ్లు తేలేసిండు బాంచెన్...."

యా. రెం. వ్య.

"తేలెయ్యడామరి? మనిషా? మాకా?"

డాక్టర్ ద. రా. మూడు బిళ్ళలిచ్చాడు.

* * *

అయిదవనాడు యాభైరెండవ వ్యక్తి చాలా ఆలస్యంగా వచ్చాడు. అతనికండ్లు చింతనిప్పుల్లా కణకణ లాడుతున్నాయి. అతని పెరిగిన జుట్టూ చెదిరిపోయి చాలా వికారంగా వుంది. ఒంటిమీద చిరుగుల పాత పంచె తప్ప మరేమి లేదు....చేతిలో మాత్రం మురికిపట్టిన పాత గుడ్డముక్కలో ఏదో వున్నట్టున్నది....

"మా అయ్య సచ్చిండు డాకుటరు...."

"సావడామరి....మనిషా?....మాకా?"

డాక్టరు పరపర రాస్తున్నాడు.

"సావటమే కాద్దొర-సచ్చి బూడిదై పోయిండు...." అని చేతిలో వున్న పాత గుడ్డ మూట విప్పి నున్నటి టేబుల్ మీద పారబోశాడు.

బూడిద ఎ. పి. సి. గోళీల డబ్బామీద, మశూచి నివారణ అడ్వర్‌టైజ్‌మెంటు-వాల్‌పోస్టరు బాపతు చీటీల మీద-డాక్టరు మెడకున్న స్టెతస్కోపు మీద డాక్టరుగారి పాల నురుగుల్లాంటి పాలిస్టర్ షర్టుమీద, నెట్టెడు పాంటుమీద. ఆఖరుకు అతని ఎర్రటి ముఖమ్మీద, కళ్ళద్దాలమీద బూడిద.

డాక్టరుగారికి రోగులంతా బూడిద రోగుల్లా మసగ్గా కనిపించారు. అలాగే బయటికి చూశాడు మెయిన్‌గేటు దాటి యాభయి రెండవ వ్యక్తి బూడిద ముద్దలాగా ఏడుస్తూ వెళ్ళిపోతున్నాడు.

అతనిముందు (ఎన్నో నంబరో అతన్ని) రోగి దీనాతి దీనంగా నిల్చున్నాడు. పాపం ఆశతో.